"సీతారామయ్య గారూ! ఈ సంఘర్షణను ఈ విధంగా ఎందుకు పరిష్కరించారో, కొంతమందికి సంతోషం కలుగొచ్చు. కాని నేను అర్థం చేసుకున్నాను. అంతేకాదు. 'చట్టం' దృష్టిలోని నేరస్తులను అరెస్టు చేయించకుండా ఎందుకు 'రాజీ' అంటూ వచ్చారో నాకుతెలుసు. మీరు మా ఓట్లతో గెలిచారు, మా ప్రతినిధిగా మాట్లాడటంలేదు, ప్రభుత్వ ప్రతినిధిగా మాట్లాడుతున్నారు. ఈ ప్రభుత్వమెవరిదో నాకు తెలుసు. సంస్కరణల పేరుతో కులాల నెందుకు పెంచుతున్నారో మేం అర్థం చేసుకుంటున్నాం. క్రొత్త బావులు నాలుగు త్రవ్వించండి! మంచిదే. అయితే అందరూ అన్ని బావులతో నీళ్ల తోడాలి అందుకే నా కృషి. నాకుతెలుసు, సంస్కరణల ద్వారా ఈ సంఘర్షణ అంతం కాదని"— అంటూ లేచి వెళ్లిపోయాడు ప్రసాద్.

## "కథకాదిది..."

వి. ప్రకాశ్

"దండాలు బాంచను"

కళ్ళద్దాలు బల్లపై పెట్టి ఆ మనిషిని నిశితంగా పరిశీలించాడు ఇన్స్పెక్టర్...

"నా పేరు కనకమ్మ బాంచను"

"ఏమిటి సంగతి"

"నేను గాంధీ నగరంలో వుంటను బాంచను— గాంధిబొమ్మ దాటితే నాలుగో యిల్లే మాది బాంచను— ఇండ్లు కిరాయకిచ్చి బతుకుతున్న— మాయింట్లో ఓ పోకిరి యెదవ చేరిండు బాంచను ఇల్లు ఖాళీ సెయ్యమంటే సేత్తలేడు. ఎట్లయినా ఆన్ని ఖాళీసేయించుండ్లి బాంచను."

"కొబ్బరి బోండలాగున్నావు నీ మొగుడులేడా?" కనకమ్మపైనుండి దృష్టిని మరల్చకుండానే అడిగాడు ఇన్స్పెక్టర్.

"ఆడు బేరానికి పోయిండు బాంచను— నెలకోసారి వత్తడు."

కాసేపాగి,

"ఆ పోకిరీయెధవ నాతిరి బాగా తాగొచ్చి నన్ను బలవంతం సేసిండు బాంచను. నేను కేకలెయ్యంగనే ఆడిగదిలోకి పోయిండు. ఆడిని ఎంటనే ఖాళీసేయించుండ్లి బాంచను. సచ్చి మీకడుపున పుడతా" దీనంగా చెప్పింది కనకమ్మ

"సరే వాడిసంగతి నేను చూస్త, నువ్వుపో"

"వాడు నాతిని నన్నేమైనా సేత్తడు బాంచను. కాల్మొక్త మీరే రచ్చించాలి" అంటూ బయటికి నడిచింది కనకమ్మ.

బయటికి వెళుతున్న కనకమ్మను గుమ్మంలోనే ఢీకొట్టాడు జేబుదొంగ కాసీం.

"సలామ్ సాబ్"

"కాసీంగా నిన్న మామూలు తీసుకురాలే ఒళ్ళు కొవ్వెక్కిందా బంచత్".

"నిన్న ఒక్క జేబుకూడా దొరకలేదు సాబ్" వణుకుతూ అన్నాడు కాసీం.

"ఎవ్వనిదగ్గర బే! నీ అబద్దాలు... అరేయ్ 401 వీణ్ణి లోపలికి తోలి తొండలెక్కియ్యి" ఓ కానిస్టేబుల్‌వైపు చూస్తూ అన్నాడు ఇన్స్పెక్టర్.

"సాబ్, సాబ్ ఇయ్యాళ తప్పక తెస్తాను సాబ్— ఈసారికి మాఫ్ కరో సాబ్" బతిమాలాడు కాసీం

"నిన్నటిది ఇయ్యాటిది కలిపితేవాలి బే! లేకపోతే తెల్లారేటప్పటికి మనిషిగా వుండవు— పో ముండాకొడుకా" కసిరాడు ఇన్స్పెక్టర్.

వంగివంగి సలామ్ చేసుకుంటు బయటికి నడిచాడు కాసీం—

"సాబ్— రంగిని పట్టుకొచ్చిన" అని రంగి జబ్బపట్టి ఇన్స్పెక్టర్ ముందుకు తోసిండు కానిస్టెబుల్.

రంగి గజగజా వణికిపోతుంది.

"ఏమే లంజముండా! దొరకననుకున్నావా? పది రోజుల్నుండి మామూళ్ళు ఎగ్గొడుతున్నవు" అంటూ కుర్చీలోంచి లేచి లాఠీ అందుకున్నాడు ఇన్స్పెక్టర్.

కానిస్టేబుల్ బయటికిపోయి తలుపేసుకున్నాడు—

"నన్ను కొట్టకుండి బాంచను. నేనావని సేత్తలేను. కూలిసేసుక బతుకుతున్న- అయ్యో...నన్నుకొట్టకుండ్లి..." అంటూ లాఠీలదెబ్బలకు చేతులడ్డం పెడ్తుంది రంగి.

"నువ్వు పనిమానుకుంటే మేమంత ఎట్లబతుకాల్నే లంజా..." అంటూ క్రింద పడిన రంగిపొట్టలో ఈడ్చితన్నాడు ఇన్స్పెక్టర్.

"అమ్మా..." అంటూ బాధతో మెలికలు తిరిగింది రంగి.

కాసేపటికి శిక్ష యింకా పూర్తి కానట్లు గుడ్డలేకుండా అచేతనంగా పడివున్న రంగిని స్టేషన్ వెనక రూమ్‌లోనికి ఈడ్చుకుపోయినారు పోలీసులు.

పోలీసు స్టేషన్‌లో గడియారం పది గంటలు కొట్టింది.

కుర్చీలోనుంచి లేచి స్టేషన్ బయటికి నడిచాడు ఇన్స్పెక్టర్.

తుంపర తుంపరగా వర్షం పడుతుంది. కాసేపు ఆగి ఏదో విశ్రమించుకున్న వాడిలాగా మోటారుసైకిల్ స్టార్టు చేసి రోడ్డుమీది ఉరికించాడు ఇన్స్పెక్టర్.

రోడ్డంతా నిర్మానుష్యంగా వుంది, అక్కడక్కడ వీధిలైట్లు వెలుగుతున్నాయి.

"మహేంద్రా బార్" అన్న బోర్డు చూసి మోటార్ సైకిల్ ఆపాడు ఇన్స్పెక్టర్

'సలామ్‌సాబ్' లేచి సల్యూట్ చేశాడు గూర్ఖా

లోపల కాబరే జోరుగా సాగుతుంది. ఇన్స్పెక్టర్‌ను చూసి ఇంకా హుషారుగా స్టెప్స్ వేస్తుంది కాబరే డాన్సర్ రోజీ.

"రోజూ బార్‌కొస్తుంటే జనానికి బొత్తిగా తనంటే భయంలేకుండా పోయింది" అని మనసులోనే తిట్టుకున్నాడు ఇన్స్పెక్టర్–

రోజీ విస్కీబాటిల్ తీసికొని ఇన్స్పెక్టర్ దగ్గర కొచ్చింది. విస్కీ బాటిల్ నోట్లో పెట్టుకుని రోజీ బ్రాసరీ హుక్స్ 'ఫట్' మనిపించాడు. చిత్తుగా తాగి పదకొండు గంటలకు మోటర్‌సైకిల్ ఎక్కాడు ఇన్స్పెక్టర్.

వర్షం ఎక్కువయింది, మోటర్ సైకిల్ గాంధీనగర్ వైపు పరుగుతీసింది.

కనకమ్మ ఇంటిముందు మోటార్‌సైకిల్ ఆపి తలుపులపై బాదాడు ఇన్స్పెక్టర్

"వస్తున్న– ఎవరూ" అంటూ తలుపు తీసి ఆశ్చర్యపోయింది కనకమ్మ. కనకమ్మను లోపలికి నెట్టి తలుపు గొళ్లెం పెట్టిండు ఇన్స్పెక్టర్–

"ఏంది బాంచను, గీయేల్లప్పుడు వానలో ఇటొచ్చిండ్లు– ఆ యెధవ భయానికి యింటికి రాలేదు–

కనకమ్మ చెప్పిందే వినిపించుకునే స్థితిలో లేదు ఇన్స్పెక్టర్.

తూలుతూ కనకమ్మను మంచము పైకి తోశాడు. అప్పటికిగాని కనకమ్మకు అర్థంకాలేదు ఎదిరించింది... ఓడిపోయింది. ఎక్కడో కోడికూత వినిపించి నిద్రలేచాడు ఇన్స్పెక్టరు. ఒళ్ళువిరుచుకుని ప్రక్కలోకి చూశాడు– కనకమ్మ అచేతనంగా పడివుంది. ఒంటిపై రక్తపు మరకలు అక్కడక్కడా మెరుస్తున్నాయి.

ఇన్స్పెక్టర్ బయటికొచ్చి మోటర్‌సైకిల్ స్టార్ట్‌చేశాడు– గాంధీ విగ్రహం దాటాడు– మోటర్‌సైకిల్‌ను పోలీస్‌స్టేషన్ వైపు త్రిప్పాడు.

స్టేషన్‌లోకి వచ్చిన ఇన్స్పెక్టర్‌ను చూసి కానిస్టేబుల్ పరుగెత్తుకుంటూ వచ్చాడు—

"సాబ్... రంగి... సచ్చిపోయింది" భయంగా ఒక్కొక్కమాటే అన్నాడు కానిస్టేబుల్–

ఇన్స్పెక్టర్‌కు బేజారెత్తింది. లోపలికివచ్చి కుర్చీలో కూర్చున్నాడు—

స్పృహతప్పి పడిపోయిన రంగిని రూమ్‌లోనికి పోలీసులు ఈడ్చుకెళ్ళినప్పుడే అడ్డుచెప్పాలనుకున్నాడు. కాని రంగి మామూలు ఇవ్వలేదనే కసితో ఏమీ అనలేక పోయాడు— గతమంతా మరొక్కసారి కళ్ళముందు తిరిగింది—

చాలా సేపు ఆలోచించాడు ఇన్స్పెక్టర్...

• • •

మరునాడు స్థానిక పత్రికల్లో తాటికాయంత అక్షరాల్లో వార్తలు చల్లగా పడినవ్—

"పోలీస్ స్టేషన్‌లోని బావిలోపడి రంగి అనే పాతికేళ్ళ పడుచు ఆత్మహత్య చేసుకుంది. అవినీతి నేరం క్రింద నిన్న రంగిని స్థానిక సబ్ఇన్స్పెక్టర్ అరెస్టు చేశాడు. చాటుగా వేశ్యావృత్తి చేస్తున్న రంగి తన విషయం నలుగురికి తెలుస్తుందనే భయంతో ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు".

దానిక్రిందనే...

"గాంధీనగరంలో కనకమ్మ అనే 30 ఏండ్ల స్త్రీహత్య. హంతకుడు కనకమ్మ యింట్లో అద్దెకుంటున్న మొహినొద్దీన్ అనే యువకుడు— కనకమ్మను గత రెండు రోజులుగా అల్లరిపెడుతూ రాత్రి బాగా పొద్దుపొయ్యాక ఆమె యింట్లో చొరబడి కనకమ్మను మానభంగం చేసి చంపేసినట్లు స్థానిక సబ్ఇన్స్పెక్టర్ తెలిపాడు."

దానిపక్కనే...

కర్తవ్య నిర్వహణలో ఎంతో చాకచక్యంగా పనిచేస్తున్న స్థానిక సబ్ఇన్స్పెక్టర్... రావుకు రాష్ట్రపతి బంగారు పతకం రిపబ్లిక్‌డే రోజు బహూకరిస్తారు.


## రచయితలకు విజ్ఞప్తి

ప్రజా సమస్యలపై వ్రాయబడిన
నాటికలు, నాటకాలు, గేయాలు పంపిస్తే
వీలునుబట్టి ప్రచురిస్తాం—

స్టార్ బుక్ హౌస్
సూర్యాపేట, నల్లగొండ జిల్లా 508 213